సందు -

తిరగాలి...


తిరిగాను. తిరుగుతూ తలెత్తి దారికి ఇరువేపులా చోటు చేసుకున్న మా పాకల వేపు చూశాను.

కొన్ని చక్కగా ముస్తాబయిన కన్నె పడుచుల్లా వున్నాయి

కొన్ని రోగాలు మోసుకుంటున్న ముసలి వగ్గుల్లా వొంగి వున్నాయి

కొన్ని ఉన్న వాడి పొగరులా వుంటే మరికొన్ని లేని వాడి వినయంలా వున్నాయి.

# కొత్తమలుపు



## —రంగనాథ రామచంద్రరావు

మా వీధి పేరు గాంధీ నగర్!

ఆ పేరు ఆ వీధికి ఎవరు పెట్టారో గాని- ఆ మహానుభావుడి పేరు మాటున ఎల్లప్పుడూ 'నిషా'నది ప్రవహిస్తూ వుంటుంది! ఆ వీధి అర చీకటి చాటున వ్యభిచారం ఆచారం ముసుగులో సాగిపోతూ వుంటుంది!!

ఆ వీధిని తలుచుకుంటేనే నాకు అసహ్యం. చిన్నప్పటి నుంచి ఆ వీధిలోనే తిరిగాను. ఇక్కడే పెరిగాను అని చెప్పుకోవటానికి కూడా నాకు యిష్టం వుండదు.

వీధి వాళ్ళందరూ నాకు బాగా తెలును. నాకు అయిన వారూ వున్నారు. కాని వారూ వున్నారు. నన్ను జాలిగా చూసిన వాళ్ళున్నారు. జుగుప్స చూపిన వాళ్ళూ వున్నారు. ఊహ తెలిసినప్పటి నుంచి హేళన సూటిపోటి మాటలు అనుభవంగా పొందాను. అందుకే ఈ వీధి వాళ్ళంటేనే నాకు అంతులేని అసహ్యం. వయస్సు పెరుగుతున్న కొద్దీ నాలో వారి పట్ల వున్న ఆ భావం మరింత ఘనీభవించింది.

ఈ రోజైతే నా మనస్సులో లేదు. అశాంతితో, అర్థంకాని అలజడితో, పట్టరాని ఆవేశంతో మననంత రగిలిపోతున్న యుద్ధభూమిలా వుంది. క్లిష్టమైన దశలో సరియైన నిర్ణయం తీసుకోవాల్సిన సైనికుడి స్థితిలా వుంది నా పరిస్థితి.

మెల్లగా అడుగులు వేస్తున్న నా గుండెల్లోకి మొనదేలిన చల్లని మంచుకత్తి సూటిగా దిగిన అనుభవం. మరుక్షణం గుండె అగ్ని కొండలా బ్రద్దలైనట్టు, మెదడులోని రక్తనాళాలు చిట్లిపోతున్నట్టు అనిపించింది. నా నరనరాల్లోనూ అణువణువులోనూ కోపం, ఉక్రోషం బుసలు కొట్టాయి. కనిపించిన ప్రతి ఒక్కర్నీ ఏదో చేసేయాలన్నంత కసితో కంపించి పోయాను. అయితే ఏం చేయాలో అర్థం కాలేదు. కాని చేయాలి. ఏదైనా చేయాలి. చేయకపోతే... ఊహూఁ! చేయకుండా వుండలేను. నేనేమీ చేయకపోతే రేణుక జీవితం?...

రేణుక జీవితం 'అలా' కావటానికి వీల్లేదు!

మిగతా ఆడపిల్లల జీవితాల్లా ఆమె బ్రతుకూ ఎందుకు మధురంగా గడిచిపోకూడదు? కట్టుకున్న భర్తతో, వళ్ళంటి పిల్లలతో ఎందుకు సాఫీగా సాగిపోకూడదు?

ఇదీ అన్యాయం !

ఆమె ప్రమేయం లేకుండానే ఆమె చుట్టూ విషవు వుచ్చు ఎందుకిలా బిగుసుకుపోతోంది? కత్తుల బోనులోకి తోయబడ్డ లేడి కూనలా క్రూర మృగాల 'ఆకలి'కి ఆమె బలికావాల్సిందేనా?

అయినా ఒకరి జీవితంపై మరొకరికి ఏమిటి ఆ అధికారం? ఒకరి జీవితాన్ని మరొకరు 'యిలా' వుండాలని ఎందుకు శాసించాలి?

ఇదెక్కడి నుండి వచ్చింది?

ఎప్పటి నుండి వచ్చింది??

ఎంత వరకు కొనసాగుతుంది...

దీనికంతటికీ బాధ్యులెవరు?

అసలీ పద్ధతిని ఎవరు ఎందుకు, ఎప్పుడు ప్రవేశపెట్టారు?

సంఘంలో గౌరవనీయమైన స్థానం లేక, సాటి వారితో సమానంగా యిమడలేక, పుట్టిన పిల్లలకు తండ్రెవరో చెప్పుకోలేక, ఆ హక్కు, అధికారం పొందే అవకాశం అసలే లేక ఎందరు స్త్రీలు ఈ 'సుడిగుండం' లో చిక్కుకుపోయారో? ఈ ఊబిలో పుట్టిన పిల్లకు ఏ స్త్రీ అయినా తండ్రి ప్రేమను తెచ్చివ్వగలదా? చదువులు చెప్పించగలదా? బ్రతుకు తెరువు చూపించగలదా?

లేదు !

తండ్రి ప్రేమ, ఆప్యాయతలు వుండవు. అసలు తండ్రే తెలియదు. తండ్రి ఎవరో తెలిసినా బయటికి చెప్పుకోలేని, చెప్పనీయని పరిస్థితులు. తోటి పిల్లల్లా స్కూలు చదువులుండవు. ఒకవేళ బడికి వెళితే చీదరింపులు, ఛీత్కారాలు, అవహేళనలు, అవమానాలు...

ఆ అనుభవాలు నాకు కొత్తకాదు! అయితే రేణుకకూ ఆమె పిల్లలకూ అలాంటి అనుభవాలు ఎదురైతే చూడగలనా? చూచి సహించగలనా?

లేదు !

ఏదో దారి వెదకాలి. ఆమె జీవితాన్ని మరో దిశకు మళ్లించాలి. ఆమె, ఆమె పిల్లలు నలుగురితో సమానంగా ఇలాంటి అవహేళనలకు దూరంగా బ్రతకాలి!

కాని ఈ రోజు పదిహేనేళ్ళయినా నిండని ఆమె శరీరాన్ని పళ్లెంలో పెట్టి డబ్బున్న వో పశువుకు 'విందు' గా యివ్వటానికి ఇంటివారు పూనుకున్నారు. అయితే ఆ డబ్బున్న ఆసామి జీవితాంతం ఆమెకు అండగా నిలబడతాడా? ఆమె పిల్లలకు తండ్రని చెప్పుకుంటాడా?

ప్చ్!!

లేదు...చెప్పుకోలేడు.

డబ్బుతో కోరిన వస్తువును కొనగలిగే అతని దృష్టిలో స్త్రీలు సైతం అంగడి సరుకులే! అందుకే 'మొగుళ్ళు' రావలసిన 'కూతుళ్ళు'న్న అతగాడికి కూతురి కంటే చిన్న వయస్సులో వున్న అపరంజి బొమ్మ రేణుక కావాల్సి వచ్చింది.

రేణుక ....



కాంతం: పాపా ! నీ వయసెంతమ్మా?
పాప: నాన్నతో బజారు కెళ్ళినప్పుడు 10 సంవత్సరాలు అమ్మతో వెడితే 6 సంవత్సరాలు.

జి. రుక్మిణీదేవి, అమలాపురం.

స్త్రీత్వానికి గులాబీల మృదుత్వం, మంచి గంధపు పరిమళం పులిమిన బంగారు బొమ్మ. కనుగందని పాలబుగ్గల లేతమొగ్గ. శాపవశాత్తు అన్నట్లు పుట్టింది వో హరిజనుల ఇంట్లో! అందులోనూ, ఓ 'బసివి' కడుపున!!

ఆ తల్లి కడుపున పుట్టిన కారణంగా ఆ ఇంటి ఆచార ప్రకారం తల్లిలా తనూ ఊహ తెలియని వయసులోనే 'బసివి' గా మార్చబడింది.

అప్పట్నుంచి ఎదురింటి వీరిగాడు, పక్కింటి పోలిగాడు సరసాలాడ్డం మొదలెట్టారు -

"ఏమే పిల్లా, నాతో కన్నెరికమెప్పుడు బెట్టించుకుంటావ్" అంటూ.

అలాంటి మాటలు నా చెవిన పడగానే విపరీతంగా ఆవేశపడిపోయేవాన్ని. చేతికందిన రాయి తీసుకుని వాళ్ళ బుర్రలు బద్దలు కొట్టాలనిపించేది. అంతలో-

"మీ లెక్కటి బేవార్సి నాయాండ్లకి నా బిడ్డగావాల్నా? అదంటే బంగారు సంచులు గొండోని పెద్ద పెద్ద మా రాజులే వస్తార్రా దొంగ నాకొడుకుల్లారా?" అనే సమాధానం వాళ్ళకు వచ్చేది.

"అదీ సుతాం లేయే" అంటూ ఆ పిల్ల బుగ్గలు గిల్లి వాళ్ళు అక్కడ్నుంచి వెళ్ళిపోయారు.

అలాంటి మాటలు మధ్య, అలాంటి మనుమల సహవాసంలో, అలాంటి వాతావరణంలో ఆమె పెరిగి పెద్దదయ్యింది. ఆడపిల్లలు అంత తొందరగా ఎందుకు ఎదిగిపోతారో? చూస్తూ వుండగానే 'చేతి' కొచ్చేస్తారు. ఈ సృష్టిలో ఇదొక వరం లాంటి శాపం!

కల్లాకపటం తెలియని మనసుతో, లేగదూడలా గంతులేస్తూ, లేడి కూనలా పరుగు తీస్తూ పసితనంలోని ఆనందాన్ని అనుభవంలోకి తెచ్చుకుంటున్న రేణుకను ఆమె మనసేమిటో గ్రహించకుండా, ఆమె ఇష్టాఇష్టాలు తెలుసుకోకుండా, ఆమె ఎలాంటి వాడిని కోరుకుంటుందో విచారించకుండా ఆ డబ్బున్న 'పశువు' దగ్గరకు ఎలా పంపగలుగుతున్నారు?

సినిమాలు చూస్తూ హాస్య సన్నివేశాలకు పకపకా నవ్వేసే, విషాద సన్నివేశాలకు స్పందించి కన్నీళ్ళు కార్చేసే అమాయకమైన ఆ పిల్ల భవిష్యత్తేమిటి?

ఏమైనా కానీ నేను పడ్డ బాధలు, అవమానాలు, ఎదుర్కొన్న అసహ్యకరమైన చూపులు ఆమె కాని, ఆమె పిల్లలు కాని పొందకూడదు.

నన్ను బళ్లో వేసేటప్పుడు - 'తండ్రి పేరేమి?' అని పంతులు అడిగితే అందుకు సమాధానంగా 'నేను 'బసివి'ని బాబు' అని అమ్మ జవాబివ్వగానే ఆ ముసలి పంతులు గాడి కళ్ళల్లో ఎగిసి పడిన ఆసక్తి పెదాలపై 'ముసిరిన' వికారపు నవ్వు నాకు ఇప్పటికీ గుర్తుంది.

అప్పట్లో రిక్షా పుల్లిగాడు సాయంత్రాలు ఎవరెవరినో ఇంటికి తీసుకొచ్చేవాడు. అమ్మ మమ్మల్ని బయటికి వెళ్ళి ఆడుకోమనేది. నేను వెళ్ళనని మొండికేస్తే 'రాములమ్మ' అంగట్లో 'కమ్మరకట్టా' కొనుక్కోమని ఐదు పైసలివ్వటం నాకు బాగా గుర్తు.

అయితే నేను పెరిగి పెద్దవుతున్న కొద్దీ ఇదంతా నాకు చాలా ఎబ్బెట్టుగా అనిపించేది. అమ్మ 'అలా' చేయటం నాకు ఏ మాత్రం ఇష్టం వుండేది. అమ్మ దగ్గరికి ఎవరెవరో వచ్చి పోవటం నాకు కోపాన్ని తెప్పించేది కాదు. వాళ్ళ వేపు ఎంతో ఉక్రోషంగా చూసేవాణ్ని. వాళ్ళపైబడి వాళ్ళ ముఖాలను గోళ్ళతో రక్కి రక్కి పెట్టాలని కసిగా అనుకునే వాణ్ణి. వొంటరిగా పడుకుని వాళ్ళను సినిమాలో హీరోలా ఎడాపెడా తంతున్నట్టు, వాళ్ళు దిక్కుకొకరు పరుగులు తీస్తున్నట్టు వూహించుకుని ఆనందించే వాణ్ని.

ఒకసారి - "అమ్మా వాళ్ళను రా నీయకే" అన్నాను.

"నీవు బాగా సదివి పెద్దోడై దండిగా దుడ్లు తెచ్చి నాకు కూడు బెడ్డువంట. గప్పుడు రానియ్యొన్లే" అంది.

అప్పట్నుంచి ఏది విన్నా ఏది చూచినా పట్టించుకోవటం మానేశాను.

నాలో పట్టుదల పెరిగింది. ఒక్కొక్క మెట్టే పైకెక్కుతూ కాలేజీ మెట్టెక్కాను. కాలేజీకి వెళ్తున్న నన్ను అమ్మ భయంగా చూసేది.

ఆ తర్వాత ఇంటి పరిస్థితిలో కొంత మార్పొచ్చింది. ఇంటికి వచ్చే వారి సంఖ్య రానురాను తగ్గసాగింది. నేను ఇంట్లో వుంటే ఎవరూ ఇంటి పరిసరాల్లో కనబడేవారు కారు. నేను ఎదురుపడితే రిక్షా పుల్లిగాడు మొహం చాటేసేవాడు. అమ్మ కూడా ఎందుకో పత్తిజిన్నులో కూలీ పనికి పోసాగింది.

ప్రభుత్వం 'ఎస్.సి' లకు ఇచ్చే చేయూతతో డిగ్రీ చేత బుచ్చుకున్నాను. ఉద్యోగం వేట మొదలు పెట్టాను. చిన్న ఉద్యోగం వచ్చినా చాలు నా వాళ్ళందర్నీ తీసుకొని ఈ పరిసరాలకు దూరంగా వెళ్ళిపోవాలి. ఇన్నాళ్ళు, ఇన్నేళ్ళు గడిపిన ఈ జీవితానికి సమాధి కట్టి 'కొత్త జీవితాన్ని' ప్రారంభించాలి. ఇదే నా లక్ష్యం!

ఎంతో కాలం నుంచి నాలో మొలకెత్తిన లక్ష్యానికి ఆశల నీళ్ళు పోసి పెంచుకొస్తున్నాను.

కాని ఈ రోజు నా కళ్ళ ముందే రేణుక మరో 'అమ్మ' కాబోతోంది. 'అమ్మ' లా తనూ ఈ ఆచారానికి బలైపోతోంది. నేనెంతగా నచ్చజెప్పినా, ఎన్ని విధాలుగా వారించినా, ఎంత గొడవ పెట్టినా ఆచారాలకు ఎదురు నిలవడానికి ఎవరూ సిద్ధంగా లేరు.

ఇకపై రేణుక అమ్మ గడిపిన జీవితంలాంటి జీవితాన్ని గడపాలి. కొన్నాళ్ళ కామెకు 'నా' లాంటి కొడుకో, 'తన'లాంటి కూతురో! ఆ తరువాత ఆమె కడుపున పుట్టిన పాపానికి వారి ముందరి భవిష్యత్తంతా అంధకార బంధురమే!

అందుకే ఏమైనా చేసి రేణుకను ఈ దారి నుంచి తప్పించి మరో కొత్తదారి చూపాలి!

అసలు ఈ వ్యవస్థలో 'దేవుడి పేరిట స్త్రీలను వొదలడం' అనే ఆచారం ఎందుకుంది?

స్త్రీలను ఇలా దేవుడికి, దేవతలకు వొదిలే ఆచారం నిమ్నజాతుల వారిలో మాత్రమే ఎందుకు కనిపిస్తోంది?

స్త్రీలను దేవుళ్ళ కిచ్చి పెళ్ళి చేయడం ఏమిటి? అందులోనూ ఆడదేవతల కిచ్చి పెళ్ళి చేయటం ఏమిటి?

"ఉరుకుంద ఈరణ్ణ", "గట్టు మల్లయ్య" లాంటి మగదేవతలకు స్త్రీలకు వొదలటంతోపాటు "ఆ జన్మబ్రహ్మచారి"గా పేరు పొందిన "ఆంజనేయ స్వామి" పేరిట కూడా స్త్రీలను వొదులుతున్నారంటే ఎవరూ నమ్మరేమో? గ్రామ దేవతలుగా పేరుబడ్డ "యల్లమ్మ", "సుంకులమ్మ", "మారెమ్మ"ల పేరిట ఆడ పిల్లలను 'బసివి' లుగా "జోగిను'లుగా మార్చేస్తున్నారు? ఇదెలాంటి ఆచారం? ఇలా అమాయకమైన ఆడపిల్లలను ఆచారం పేరుతో దేవతల కిచ్చి పెళ్ళి చేస్తే; నిజంగా దేవతలంటూ వుంటే వారు సంతోషిస్తారా? దేవతల పేరిట జరిగే ఈ దారుణానికి ఎందరు అమాయక స్త్రీలు బలౌతున్నారో? దీనికి అంతే లేదా?

ఇప్పుడిప్పుడే ప్రభుత్వం ఈ దురాచార విషయంలో కళ్ళు తెరిచి తీవ్రంగా కలగజేసుకుంటోంది. ఇకపై ఆడపిల్లను 'బసివి'గా విడవరాదని; అలా బసివిలుగా మార్చటం 'నేర'మని హెచ్చరించింది. ఆ విషయమై ఒక చట్టాన్ని కూడా చేసింది. అయినా ఆచారం పేరుతో ఎందరో చట్టాన్ని అతిక్రమిస్తూనే వున్నారు. మూఢాచారాలు, గుడ్డి నమ్మకాలు వాళ్ళను భయపెట్టినంతగా చట్టాలు, శిక్షలు వారిని భయపెట్టలేకపోయాయి. ప్రతిఫలంగా ఎన్నో వేల మంది అమాయక స్త్రీలు ఊహ తెలియని వయసులోనే 'బిసివి' సంఖ్యకు అదనంగా చేర్చబడుతూనే వున్నారు. కాముకుల కోరికలు తీర్చే యంత్రాలుగా మార్చబడుతూనే వున్నారు.

మేనేజర్: ఇంటర్వ్యూకి వచ్చిన ఓ యువతితో "చూడమ్మా! నీలాంటి వారు మాకు అక్కర లేదు. నడి వయస్సు వారు కావాలి".

యువతి: "అయితే మేకప్ తీసేస్తా నుండండి" అని ఠక్కున చెప్పింది.

కలగాన జగదీష్, చినదొడ్డిగల్లు.

ఈ రోజు రేణుకను అతి దారుణంగా సంతలో పశువులా అమ్మేశారు. ఒక జత వెండి కాలి పట్టీలకు, ఐదు వందల రూపాయలకు, ఒక దుప్పటికి, పాతిక గ్లాసుల సారాకు ఓ డబ్బున్న ముసలి పశువుకు ఆమెను అమ్మేశారు. అతనితో ఈ రోజు 'కన్నెరికం' ఏర్పాటు చేశారు.

జత వెండి కాలి పట్టీలు + ఐదు వందల రూపాయలు + ఒక దుప్పటి + పాతిక గ్లాసుల సారా = కన్యాత్వం.

ఎంత దారుణం!!

ఈ రోజు అతి చౌకగా, అతి సులభంగా పదిహేనేళ్ళ పవిత్ర అందం ఒక ముసలి కాముకుడికి సొంతం కాబోతుంది. 'భారత దేశం' లో 'కన్యాత్వం' ఇంత చౌక అని ఎవరూ ఊహించి వుండరు. రేపటి నుండి ఆమె జీవితం నరకం...

కానీ నా ప్రాణానికి ప్రాణమైన రేణుక పది మంది కళ్ళల్లో పడి, పది మంది చేతుల్లో నలిగి రకరకాల రోగాలకు నిలయంగా మారటం నేను సహించలేను. ఆమెనో యింటి ఇల్లాలిగా, ఓ పవిత్ర మాతృమూర్తిగా చూడాలని ఎంతకాలంగానో కలలు కంటున్నాను.

నడుస్తూ వున్నాను...

నాలోనూ ఆలోచనలు నడుస్తూ వున్నాయి....

నన్ను చుట్టి ముట్టి పాముల్లా కాటేస్తున్న ప్రశ్నలకు సమాధానాలు వెదుకుతూ ఒక్కొక్క అడుగు వేస్తున్నాను.

మళ్ళీ వో సందు. తిరిగాను. అల్లంత దూరంలో ఇల్లు. ఇంటి ముందున్న చెట్టు కింద తూలుతూ పేలుతున్న ముదనష్టపు కులపెద్దలు, ఇంట్లో హడావుడిగా తిరుగుతున్న అమ్మలక్కలు రేణుక భవిష్యత్తుకు సమాధి కట్టడానికి అట్టహాసంగా సన్నాహాలు చేస్తున్నారు.

అడుగు ముందుకు పడలేదు...

ముంచుకొస్తున్న చీకటిలో ఆ వీధి మునిగిపోతున్నట్టుగా వుంది.

సందు మొగదలలో వున్న వీధి దీపం ఆగి ఆగి కన్ను కొడుతూ వుంది.

జరగబోయే ఘోరాన్ని తాము చూడలేమన్నట్టు దారి పక్కనున్న చెట్లు తలలు వొంచుకుని శిలా విగ్రహాల్లా నిలబడ్డట్టుగా వున్నాయి.

ఎక్కడెక్కడో తిరిగిన గువ్వ పిట్టలు చెట్ల కొమ్మల్లో దాక్కుంటున్నాయి.

తల్లి పక్షుల్ని చేరగానే. పిల్ల పక్షులు వాటి రెక్కల్లో దూరి కువకువమని చేసే సద్దు జరగబోయే దారుణాన్ని అరచి అరచి తల్లితో చెబుతున్నట్టుగా అనిపించింది.

సంచు చివర కూర్చున్న నల్లకుక్క వుండి వుండి హృదయ విదారకంగా ఎలుగెత్తి ఏడుస్తూ వుంది.

హఠాత్తుగా నా రెండు కాళ్ళు బరువెక్కినట్లయ్యింది.

నేలకు పాదాలానించి మేకులు దిగొట్టినట్టయి కాళ్ళు కదపలేకపోయాను. ముందుకు వెళ్ళటానికి మనసొప్పలేదు. వెనక్కి తిరగబోయాను.

అంతలో దారి ప్రక్కనే వున్న వేపచెట్టు మొదట్లో ఎవరో కదలినట్టయ్యింది.

అక్కడ అతి పల్చగా పరుచుకున్న వీధి దీపపు కాంతిలో రేణుక...

వింటిని వదలిన బాణంలా దూసుకుపోయాను. నన్ను చూడగ్గానే, దగ్గరికి చేరగానే బావురుమంటూ 'కోతి పిల్ల'లా కరుచుకుపోయింది.

నా కళ్ళల్లో కన్నీరు...

ఆమె వీపుపై చేతుల కదలిక...

వెక్కిళ్ళ మధ్య ఆమె చెప్పిన విషయం నాకు కర్తవ్యాన్ని నిర్దేశించింది. గట్టిగా ఆమె చేయి పట్టుకుని అడుగు ముందుకు వేశాను.

*** *** *** *** ***

"ఓలమ్మో గెంత వంజేసిందే గబ్బులంజ! రేత్రి బల్లో ఆ కొత్త టీచర్ నాయాలు నాల్గచ్చరాలు సెప్తాడని అంపిస్తే బిడ్డకే ఎసరు బెట్టిండాడు. ఏం సెప్పిండాడో... ఏం మందు బెట్టిండాడో... ఆ 'భాడుకోవ్' దీన్ని లెగదీస్కుని యాడికి బోయిండాడో ఏమో! యింగ నానేం సేతున్రో దేవుడో'

చప్పున మెలుకువ వచ్చింది.

గుండెలు బాదుకుంటూ ఆమె పెడుతున్న శోకాలకు, మధ్య మధ్య ఆమె విసురుతున్న మాటలకు నేనేమీ కంగారు పడలేదు. రేణుక ఎక్కడికి వెళ్ళిందో నాకు బాగా తెలుసు. రేణుక తనకు నచ్చినవాడితో వెళ్ళిపోయింది!

కాదు - నేనే పంపాను!

మా వీధి బడికి వచ్చిన కొత్త పంతులు పగలు పిల్లలతో రాత్రిళ్ళు పెద్దలతో అక్షరాలు దిద్దిస్తూ చదువే అభివృద్ధికి 'మొదటి మెట్టు' అనేవాడు. మనిషిని 'మనిషి'గా చూడగలిగేవాడు. అన్నిటినీ మించి రేణుకను కోరుకున్న వాడు. ఆమెకూ ఇష్టమైన వాడు.

అందుకే ధైర్యం చేసి ఇక్కడ వుండి ఇలాంటి అర్థహీనమైన బ్రతుకు గడిపే కంటే, కోరుకున్న వాడి నీడలో తన జీవితానికో అర్థాన్ని కల్పించుకొమ్మని అతనితో పంపాను బంగారు తల్లి రేణుకను.

నా కన్న తల్లి కన్న కూతుర్ని!!

*